సాక్షి చిత్తూరు

ఆదివారం । 27 । జూలై । 2025



పర్యావరణ అనుమతి తప్పనిసరి

ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు పర్యావరణ అనుమతులు తప్పనిసరని కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ అన్నారు. - 8లో



త్యాగాలు మరువలేనివి

అమర వీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు అన్నారు. - 8లో



జీతాలు వెంటనే చెల్లించాలి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు టీచర్లకు ఆగిపోయిన జీతాలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నేత రమణ కోరారు. - 8లో

న్యూస్‌రీల్

విపక్షాన్ని నిర్మూలించే కుట్ర

– కేఆర్‌జే భరత్, ఎమ్మెల్సీ, కుప్పం



కెఆర్‌జె భరత్

శాంతిపురం: విపక్ష నాయకుల భద్రతను తొలగించడం, తగ్గించడంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేసే కుట్రను అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. ఇందులో భాగంగానే సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉన్న గన్‌మెన్లను ప్రభుత్వం తొలగించిందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు కలిగిన నేతకు భద్రత లేకుండా చేయడంతో ప్రభుత్వం ఏమి సందేశం ఇస్తోందని ప్రశ్నించారు. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతను తగ్గించి, తమ పార్టీ నాయకులకు గన్‌మెన్లను తొలగించడంతో ఎవరూ బయటకు రాకుండా చేయాలని పాలకులు భావిస్తున్నారన్నారు. కానీ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అండతో అధికార పార్టీ వైఫల్యాలపై తమ పార్టీ చేస్తున్న పోరాటం ఆగదన్నారు.

వరసిద్ధుడి సేవలో కేంద్ర సాధికార కమిటీ సభ్యులు



చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్ర ప్రకాష్ గోయెల్ విచ్చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. కాణిపాకం విచ్చేసిన కేంద్ర సాధికార కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ కాణిపాకం అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కమిటీ సభ్యులకు ఆలయం ముఖద్వారం వద్ద ఆలయ ఈఓ పెంచల కిషోర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం కేంద్ర సాధికార కమిటీ సభ్యులకు ఆలయంలో వేద పండితులు వేద ఆశీర్వచనం పలికి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ భరణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ఆదివారం ప్రభుత్వ సెలవురోజు అయినప్పటికీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో విద్యుత్ బిల్లులు కట్టవచ్చని అధికారులు తెలిపారు. రెండు జిల్లాల్లోని అన్ని విద్యుత్ బిల్లుల కేంద్రాలు పనిచేస్తాయని చిత్తూరు, తిరుపతి జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఇస్మాయిల్‌అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు. ముఖ్యంగా హెచ్‌టీ సర్వీసుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వసతి.. దుర్గతి!

అమ్మానాన్నలకు దూరంగా.. చదువే లక్ష్యంగా..ఊరొదిలి వచ్చారు.. వసతి గృహాల్లో సంక్షేమంపై నమ్మకం..ఆశతో చేరారు. అక్కడ సంక్షేమం సమసి.. సమస్యలు ఎగిసిపడుతుండడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. నీళ్ల సాంబారు, చప్పిడి చారు.. ముద్దకట్టిన అన్నం.. బోరు నీరే మినరల్ వాటర్.. చిరిగిన దుప్పట్లు.. విరిగిన ట్రంకు పెట్టెలు.. ఆరుబయటే కాలకృత్యం.. స్నానం.. లోపించిన పారిశుధ్యం.. ఒకటేమి సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారు. వీరి అవస్థలపై సాక్షి విజిట్ చేయగా వసతి.. దుర్గతి అని తేలింది.

- నిరుపేద విద్యార్థులపై కూటమి చిన్నచూపు
- దుస్థితిలో సంక్షేమ వసతి గృహాలు
- శిథిలావస్థలో వసతి గృహాలు
- అద్దె భవనాల్లో సం'క్షా'మం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పుంగనూరు బీసీ బాలుర వసతి గృహంలో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు, చాపలపై పడుకున్న విద్యార్థులు



చిత్తూరు కలెక్టరేట్: కూటమి సర్కారు ఏడాది కాలంగా సంక్షేమ వసతి గృహాల బాగోగులను విస్మరించింది. ఫలితంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, గురుకుల వసతి గృహాల్లో సంక్షేమం చతికిల పడింది. శిథిల భవనాలు.. అద్దె భవనాలు.. అరకొరగా ఉన్న భవనాల్లో వర్షం కురిసే ఉరిసే గదులు, తలుపులు లేని మరుగుదొడ్లు, నీరు లేని స్నానపు గదులు ఒకటేమిటి సవాలక్ష సమస్యలు తిష్టవేశాయి. దీంతో సంక్షేమ వసతి గృహాలు కారాగారాలను తలపిస్తున్నాయి. దీనిపై ఇటీవల రాష్ట్ర హైకోర్టు సీరియస్ అయ్యింది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, గురుకుల వసతి గృహాలను రెండు రోజుల పాటు సాక్షి విజిట్ చేసింది.

వణుకుతున్న 'సంక్షేమ'ం

జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల విద్యార్థులకు ఈ ఏడాది దుప్పట్లు, బ్లాంకెట్స్ సరఫరా చేయని దుస్థితి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి చాపలను తెచ్చుకుని నిద్రిస్తున్నారు. అవి కూడా తెచ్చు కోలేని వారు కటిక నేలపైనే నిద్రపోతున్నారు. చాలా వసతి గృహాల్లో విద్యార్థులు ఒక దుప్పటినే ఇద్దరు, ముగ్గురు కప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

సబ్బులు, తలకు నూనెలూ లేవు

వసతి గృహాల్లోని విద్యార్థులకు 2 నెలలుగా కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు చింపిరి జుట్టు.. మాసిన దుస్తులతో ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ వసతిగృహాల్లో 3 నుంచి 5 తరగతుల బాలురకు రూ.125, బాలికలకు రూ.130, ఆరు నుంచి పదో తరగతి వరకు బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్మీడియట్, ఆపైన చదివే బాలురకు రూ.200, బాలికలకు రూ.250 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇందుకు అదనంగా 3 నుంచి పదో తరగతి వరకు చదివే బాలుర కటింగ్‌కు రూ.50 చెల్లించాలి. ఈ చార్జీలు మంజూరులో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది.



కార్వేటినగరం ఎస్సీ హాస్టల్‌లో పాడైన ఫ్యాన్

కన్నెత్తి చూడని వైద్యులు

ప్రస్తుత సీజన్‌లో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. నిబంధనల మేరకు ప్రతి నెలా ప్రభుత్వ వైద్యులు సమీప వసతి గృహాలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేయాలి. అయితే చాలా వసతి గృహాల విద్యార్థులకు వైద్యులు వస్తారనే సమాచారం కూడా తెలియదు. జిల్లా కేంద్రంలోని వసతి గృహాల వైపే వైద్యులు కన్నెత్తి చూడడం లేదు. ఇక మారుమూల గ్రామాల్లో ఉన్న వసతి గృహాలకు ఏ మాత్రం వెళుతుంటారో అర్థం చేసుకోవచ్చు.

భద్రత కరువు

జిల్లాలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. వాచ్‌మెన్‌లు లేకపోవడంతో బాలికలు అభద్రతా భావంతో బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో పలు వసతి గృహాల్లో రాత్రి వేళల్లో అగంతకులు, ఆకతాయిలు, మందుబాబులు చొరబడినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బాలికల వసతి గృహాల్లో పురుషులను సిబ్బందిగా నియమించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ జిల్లాలో ఆ నిబంధన అమలు కావడంలేదు.

మెనూ ఇలా.. తినేదెలా?

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉంటుంది. అయితే మెనూ ప్రకారం పలు వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. నీళ్ల సాంబారు, చప్పిడి అన్నం, రుచి లేని రసం పెడుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఆ భోజనం తినలేక పస్తులుంటున్నారు. కొంత మంది వార్డెన్లు కమీషన్‌లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు. టెండర్ల సమయంలో నిర్దేశించిన వివిధ బ్రాండ్‌ల నిత్యావసర వస్తువులను సరఫరా చేయకుండా నాసిరకం వస్తువులను సరఫరా చేస్తున్నారు. ఈ విషయంలో ఏమీ మాట్లాడకుండా ఉండేందుకు ప్రతి నెలా కాంట్రాక్టర్లు కొంత మొత్తం ముడుపులను వార్డెన్లకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పలమనేరు బీసీ హాస్టల్‌లో దెబ్బతిన్న ట్యాంకు



అపరిశుభ్రంగా ఉన్న పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం

కాంట్రాక్టులు కొట్టేసిన పచ్చనేతలు

జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మైనర్ రిపేర్ల టెండర్లను పచ్చనేతలు కొట్టేశారు. అనంతరం పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.లక్షల నిధులు వృథా అవుతున్నాయి.



చౌడేపల్లి బీసీ వసతి హాస్టల్‌కు దారి లేక పొలాల మధ్య వెళుతున్న విద్యార్థులు

కంటిపై కునుకు కరువు

జిల్లాలోని దాదాపు అన్ని వసతి గృహాల్లో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం సీజన్ మారడంతో దోమల బెడద రోజురోజుకూ తీవ్రం అవుతోంది. దోమ తెరలు కొనుగోలు చేసేందుకు అనుమతులు లేవని చెబుతున్న అధికారులు, కనీసం కిటికీలు, తలుపులకు నెట్‌ను ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో దోమల మోత అధికమై విద్యార్థులకు కంటిమీద కునుకు కరువైంది.



చౌడేపల్లి బీసీ హాస్టల్‌లో చిరిగిపోయిన మెష్

జిల్లాలోని వసతి గృహాల వివరాలు

ఎస్సీ వసతి గృహాలు	57
ఎస్టీ వసతి గృహాలు	3
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	7
బీసీ వసతి గృహాలు	38
ట్రైబల్ గురుకులాలు	4
మహాత్మాగాంధీపూలే గురుకులాలు	5
ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	2
బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులు	1,740
ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థులు	2,887

విద్యార్థులకు కాళకృత్యం

జిల్లాలోని వసతి గృహాల్లో మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్న వాటికి తలుపులు, నీటి వసతి లేవు. స్వీపర్లు లేకపోవడంతో విద్యార్థులే మరుగుదొడ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కనీసం ఫినాయిల్ సైతం లేకపోవడంతో పలు వసతి గృహాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. వసతి గృహాల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులకు జ్వరాలు వ్యాపిస్తున్నాయి.



కార్వేటినగరం ఎస్సీ వసతి గృహంలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు



చిత్తూరు గిరింపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో అపరిశుభ్రంగా ఉన్న నీటి తొట్టె

ఉదాహరణలివీ..

- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం ఎస్సీ బాలుర వసతి గృహంలో స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అందులో నీరు రావడం లేదు. గత్యంతరం లేక విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోకి పొలాల్లోకి వెళుతున్నారు. కాగా వసతి గృహంలోని చేతిపంపు వద్ద స్నానాలు చేస్తున్నారు. వసతి గృహం గోడలపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో చిట్టడివిని తలపిస్తోంది. మినరల్ వాటర్ ప్లాంట్ లేకపోవడం విద్యార్థులు బోరు నీటిని తాగుతున్నారు.
- నగరి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, బ్లాంకెట్స్ సరఫరా చేయకపోవడంతో చలికి వణుకుతున్నారు. కొంత మంది విద్యార్థులు ఇళ్ల నుంచి చాపలను తెచ్చుకున్నారు. గతంలో ఇచ్చిన దుప్పట్లు చిరిగిపోయినప్పటికీ విద్యార్థులు వాటినే కప్పుకుంటున్నారు. విజయపురం మండల కేంద్రంలోని వసతి గృహం ప్రైవేట్ భవనం కావడంతో మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. ఉన్న మరుగుదొడ్లకు కూడా తలుపులు లేకపోవడం, విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. తాగునీటికి ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో బోరునీటినే తాగుతున్నారు.
- పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు పట్టణంలో ఉన్న బీసీ వసతి గృహంలో 70 మంది విద్యార్థులున్నారు. వీరికి సరిపడే స్నానపు గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానం చేస్తున్నారు. అలాగే పుంగనూరు ఎస్సీ వసతి గృహంలో 111 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వం బెడ్‌షీట్లు, బ్లాంకెట్స్, ట్రంకుపెట్టెలు, ప్లేట్‌లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుని వినియోగిస్తున్నారు. అలాగే చౌడేపల్లి మండలంలోని బీసీ వసతి గృహంలో లైట్‌లు, ఫ్యాన్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. కిటికీలకు మెష్‌లు లేవు. చివరకు ఆ హాస్టల్‌కు దారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక, చేతులు శుభ్రం చేసుకునే నీటినే విద్యార్థులు తాగుతున్నారు.
- చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు నగరంలో మూడు ఎస్సీ వసతి గృహాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. గిరింపేటలోని బాలాజీ నగర్ ఎస్సీ బాలుర వసతి గృహం ప్రైవేట్ భవనం కావడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఆ భవనాలకు కిరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి దోమలు వృద్ధి చెందాయి. హాస్టళ్ల పరిసరాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడిన మరుగుదొడ్లు లేవు. నీటి సౌకర్యం వేధిస్తోంది. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వెల్లడించారు. విద్యార్థులకు బెడ్‌షీట్‌లు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు.
- సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పంలో గత 40 ఏళ్లుగా వసతి గృహాలు మెరుగుపడని దుస్థితి. దీంతో విద్యార్థులు కుప్పం నుంచి చిత్తూరు జిల్లా కేంద్రానికి వచ్చి, వసతి గృహాల్లో ఉంటున్నారు. సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.
- పలమనేరు నియోజకవర్గంలోని పలు వసతి గృహాల మరమ్మతుల పనులను అక్కడి ఎమ్మెల్యే అనుచరులకు అప్పగించారు. అయితే వారు పనులు చేయలేదు. పలమనేరులోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరి, కూలే స్థితిలో ఉంది.
- పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం గిరిజన గురుకుల పాఠశాల శిథిలావస్థలో ఉంది. బంగారుపాళెం ఎస్సీ బాలుర వసతి గృహంలో తాగునీటి సమస్య ఉంది. బీసీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో ఉండడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి.

స్లో రైడింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీసు ఏఆర్ గ్రౌండ్స్‌లో స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీఎస్పీలు సాయినాథ్, చిన్నికృష్ణ, మహబూబ్ బాషా జెండా ఊపి ప్రారంభించారు. దాదాపు 40 మంది పోలీసులు ఈ పోటీల్లో పాల్గొనగా.. రెండో రౌండ్‌కు 11 మంది అర్హత సాధించారు. నిర్దేశిత దూరాన్ని మోటారు సైకిల్‌లో కాలు కింద పెట్టకుండా, నెమ్మదిగా వెళ్లడమే ఈ పోటీలో షరతు అని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. తుది విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కాగా ఆదివారం కూడా ఈ పోటీలు కొనసాగుతాయన్నారు.

నిరాశ్రయులకు వైద్యపరీక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, నిరాశ్రయులకు పరీక్షలు చేశారు. నగరంలోని టెలిఫోన్ కాలనీలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ (యూహెచ్‌సీ)సెంటర్ వైద్యులు, సిబ్బంది కలిసి.. నిరాశ్రయుల కేంద్రంలో ఉన్న పలువురు వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జోసెఫ్ రాజు, వైద్యులు మీనాక్షి సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

జీతాలు వెంటనే చెల్లించాలి

– డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన పలువురు టీచర్లకు ఆగిపోయిన రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు శనివారం సాయంత్రం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఉపాధ్యాయులు బోధన కంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతులు పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశాయన్నారు. ఇవి కాకుండా టీచర్లకు ఎలాంటి సంబంధం లేని పీ4 వంటి విషయాలు మోపడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. బదిలీల ప్రక్రియ పూర్తయి నెలరోజులు పూర్తి అవుతోందని, అయితే ఇప్పటివరకు వేలాది మంది టీచర్లు రిలీవ్‌కు నోచుకోకపోవడం బాధాకరమని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ ఆరోపించారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో పేరుకు ఐదుగురు టీచర్లను ఇచ్చినా పలు పాఠశాలల్లో ఇద్దరే పనిచేస్తున్నారన్నారు. దీంతో ఇతర టీచర్లపై బోధన భారం పడుతుందని చెప్పారు. మరోవైపు ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధించడం కరెక్టు కాదన్నారు. రాష్ట్రంలోని 25 వేల మంది టీచర్లకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకున్నా, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించి, జీతాలు ఇవ్వకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు కె.రెడ్డెప్పనాయుడు, ఎస్. రెహానాబేగం, కోశాధికారి కె. ప్రసన్న కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శులు సీపీ ప్రకాష్, ఏకాంబరం, పార్థసారథి, పంటపల్లి సురేష్, శశికుమార్, సాధన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం వీడండి

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు. చిత్రంలో డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, స్త్రీశిశు కమిటీ చైర్ పర్సన్ భారతి

చిత్తూరు కార్పొరేషన్ : స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వీడాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్ అధ్యక్షతన, డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు ఎప్పటిలాగే శాఖలపరంగా మార్పులేని ప్రగతి నివేదికను తెలియజేశారు. పలు సమస్యలపై జెడ్పీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జెడ్పీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మాణానికి టెండర్లు పిలవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్ణీత సమయంలో శుభ్రం చేయిస్తుండాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విషజ్వాలకు సరైన చికిత్స అందించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యం సక్రమంగా అందించాలన్నారు. ఈ వర్షాకాలంలో ఇరిగేషన్ అధికారులు నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు. పంచాయతీల్లో విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో వేచి ఉన్నారని, సకాలంలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో ఏనుగుల కట్టడికి సోలార్ పెన్సింగ్ ఏర్పాటుకు జెడ్పీ నిధుల విడుదల చేసినా పురోగతి ఎందుకు కనిపించడం లేదన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు?

డిసెంబర్ 2023 నుంచి కొత్త పింఛన్లు రావడం లేదని, ఎప్పుడిస్తారని పాలసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ అధికారులను నిలదీశారు. కనీసం స్పౌజ్ పింఛన్లకు కూడ అవకాశం కల్పించకపోవడం బాధకరమన్నారు. తల్లికి వందనం పథకం అర్హులైన వారికి కూడా ఎందుకు పడడం లేదన్నారు. వనదుర్గాపురంలోని యూపీ పాఠశాలను 9 కిలోమీటర్ల దూరంలో ఉండే ఎస్‌ఆర్‌ఎన్ కండ్రిగలో విలీనం చేశారన్నారు. విద్యార్థులు రోజు అంత దూరం ఎలా వెళ్లి చదువుకోవాలని నిలదీశారు. పంచాయతీరాజ్ పరిధిలో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ పనులకు బిల్లులు ఎప్పుడిస్తారని వడమాలపేట జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుల వద్ద డబ్బులు కట్టించుకుని వ్యవసాయ సర్వీసులు సకాలంలో ఇవ్వడం లేదని పీలేరు జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి తెలిపారు. పల్లెలకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇవ్వడం లేదని ఎర్రవారిపాళెం జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నారన్నారు. తిరుపతి ఐసీడీఎస్ పీడీ జెడ్పీ సమావేశాలకు ఎందుకు రావడం లేదని సత్యవేడు జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ప్రశ్నించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తయిన బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని శ్రీకాళహస్తి జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటసుబ్బారెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారులకు మెమోలు ఇవ్వండి

కొందరు జిల్లా అధికారులకు జెడ్పీ సమావేశాలు అంటే నిర్లక్ష్యంగా మారిందని జెడ్పీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు సమావేశాలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అటవీశాఖ, ఐసీడీఎస్, డీపీఓ,డీఆర్‌డీఏ, ఎన్‌హెచ్ఏఐ, విద్యుత్‌శాఖ అధికారులకు మెమోలు ఇవ్వాలని డిప్యూటీ సీఈఓను ఆదేశించారు.

రైతు పొలంలో కొండచిలువ



వి.కోట: ఓ రైతు వ్యవసాయ పొలంలో కొండ చిలువ హల్‌చల్ చేయడంతో రైతులు భయందోళనకు గురైన సంఘటన వి.కోట మండలం కొడగళ్లు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రైతుల కథనం మేరకు.. కొడగళ్లు గ్రామంలోని భార్గవ్ మల్బరి తోటలో రైతుకు కొండచిలువ కనిపించింది. దీంతో భయందోళనకు గురై ఆయన పరుగులు తీశాడు. పొరుగున ఉన్న రైతులకు ఈ విషయం తెలిపాడు. అనంతరం మండలంలోని పెద్దరాంపల్లి గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ రాజ్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటన స్థలానికి చేరుకుని దాదాపు 9 అడుగులు ఉన్న కొండచిలువను చాకచాక్యంగా పట్టుకుని కొమ్మరమడుగు అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్లు రైతులు తెలిపారు.

నల్లమందు తిని ఆవుకు గాయాలు

పులిచెర్ల(కల్లూరు) : అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన నల్లమందు ఉండలను నమిలిన ఆవు తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని 102 ఇ రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చిగరమాకులపల్లెకు చెందిన రైతు మల్లికార్జున శనివారం తన ఆవును మేత కోసం పొలాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ వేటగాళ్లు ఉంచిన నల్లమందు ఉండలను ఆవు నమిలింది. దీంతో ఆవు నోరు ఛిద్రమైంది. బాధితుడు లబోదిబోమంటున్నాడు.

పర్యావరణ అనుమతులు తప్పనిసరి

● కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్



మాట్లాడుతున్న కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పనులు అటవీ మార్గాల వైపు వెళితే, తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు ఉండాలని కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ స్పష్టం చేశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన శనివారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టాడింగ్ కమిటీ సూచనలను అనుసరించి చిత్తూరు అటవీ డివిజన్ పరిధిలోని 7.1 కిలోమీటర్ల రహదారి పనులు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా నిర్మించాలన్నారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిబంధనల మేరకు రహదారి నిర్మాణంలో అనుకూలించిన ప్రదేశాల్లో చిన్న ప్రాణులు స్వేచ్ఛగా వెళ్లేందుకు అండర్‌పాస్‌లు నిర్మించాలన్నారు. ప్రత్యేకంగా ఏనుగుల కోసం కర్ణాటక ఆర్టీసీ శాఖ బందిపూర్, నేషనల్ పార్కులో అమలు చేసిన యాంత్రిక రైల్వే అడ్డంకి రూపకల్పనను జిల్లాలో అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకునేందుకు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో పది మీటర్ల మేరకు వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ స్పందన బృందాన్ని ఏర్పాటు చేసు కోవాలన్నారు. రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీధర్, అనంతపురం, తిరుపతి కన్జర్వేటర్ యశోదబాయ్, జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, ఎన్‌హెచ్ఏఐ పీడీ కార్తీక్ పాల్గొన్నారు.

మామిడి రైతులు వివరాలు సరి చూసుకోవాలి

– జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి



రైతుల వివరాలు నమోదుపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: ఫ్యాక్టరీలకు మామిడికాయలను పంపిన రైతులు వివరాలను సరి చూసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం బంగారుపాళెంలో వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మామిడితోటల్లో పండించిన తోతాపురి మామిడిని ఫ్యాక్టరీలకు పంపిన రైతుల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రం సిబ్బందికి అందజేయడం జరిగిందన్నారు. మామిడి పంటను పంపిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రం సిబ్బంది వద్ద తమ వివరాలు, బ్యాంక్ ఖాతా, ఆధార్ నంబర్, ఫ్యాక్టరీకి పంపిన కాయల తూకం, ఎన్నిలోడ్లు సరఫరా చేశారనే వివరాలు సరి చూసుకోవాలని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది ప్రతి రైతుతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకుని కచ్చితమైన వివరాలను అందజేయాలని చెప్పారు. ర్యాంప్‌లకు సరఫరా చేసిన రైతుల జాబితా వివరాలను మరో వారం రోజుల్లో రైతు సేవా కేంద్రం సిబ్బందికి అందజేయనున్నట్లు చెప్పారు. తప్పుడు వివరాలు నమోదు చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యానశాఖ అధికారి సాగరిక, ఏఓ భారతి పాల్గొన్నారు.

వర్గపోరుతో వాస్తవాలు బట్టబయలు

– టీడీపీ నేత గుండయ్య రూ.కోట్లకు పడగలెత్తాడు!



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సాక్షిటాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలలకే నాయకుల మధ్య వర్గపోరు తీవ్రస్థాయికి చేరుకోవడంతో కొందరు నేతల బండారం బయట పెడతున్నారు. వాస్తవాలను వెల్లడిస్తూ ఒకరిపై ఒకరూ దుమ్మెత్తిపోసుకుంటూ, వారు చేస్తున్న అక్రమాలను బయట పెట్టుకుంటున్న సంఘటన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రెండు రోజులుగా కోడైకూస్తోంది. శ్రీరంగరాజపురం మండలంలోని టీడీపీ నాయకుడు గుండయ్య అవినీతి అక్రమాలను అదే పార్టీకి చెందిన పలువురు నాయకులు బయట పెట్టడం చూసి, ప్రజలు విస్తుపోస్తున్నారు. ఒక పేద కుటుంబంలో పుట్టిన గుండయ్యకు రూ.కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని కూటమి నాయకులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. శనివారం శ్రీరంగరాజపురం ప్రెస్‌క్లబ్‌లో పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకుడు గుండయ్యకు రాణిపేట, తిరుపతి, శ్రీరంగరాజపురంలో జాతీయ రహదారికి ఆనుకుని మూడంతస్తుల భవనాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనుచరుడినని చెప్పుకుంటూ నియోజకవర్గం వ్యాప్తంగా ఫీల్డ్అసిస్టెంట్లు, సంఘమిత్రల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడ్డాని ఆరోపించారు. అలాగే పెనుమూరు మండలంలో అంగన్‌వాడీ ఉద్యోగాలను అమ్ముకున్నాడని, నియోజకవర్గం వ్యాప్తంగా గ్రావెల్ మాఫియాకు పాల్పడి, రూ.లక్షల దండుకున్నాడని ఆరోపించారు. ఇవి చాలవన్నట్లు సెటిల్ మెంట్లు చేస్తూ రూ.లక్షల అవినీతికి పాల్పడ్డాడని, అందుకు తగిన రుజువులు తమ వద్ద ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండయ్య చేసిని అవినీతి అక్రమాలపై కేసులు నమోదు చేసి, పేదలకు న్యాయం చేయాలన్నారు. గుండయ్యను వెంటనే పార్టీ నుంచి తొలగించాలని, ఆయన భార్యను కూడా ఏఎంసీ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

త్యాగాలు మరువలేనివి

● ఘనంగా కార్గిల్ విజయ్ దివస్
● మాజీ సైనికులకు సత్కారం

చిత్తూరు కలెక్టరేట్ : దేశం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేనివని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, మాజీ సైనికులకు సత్కారం చేశారు. అనంతరం గాంధీబొమ్మ నుంచి అమర్ జవాన్ స్థూపం వరకు ర్యాలీ చేసి, అమరవీరులకు నివాళులర్పించారు.

తరువాత కార్గిల్ యుద్ధంలో పా ల్గొన్న సైనికులు, మాజీ సైనికులను సత్కరించారు. మాజీ సైనికులు పళని, రాజన్, సూపరింటెండెంట్ రజాఖ్ ఖాన్, వెల్ఫేర్ ఆర్గనైజర్ వినా యకరెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న నెహ్రూ యువ కేంద్ర అధికారులు

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో..

నగరంలోని నెహ్రూ యవకేంద్రం ఆధ్వర్యంలో స పోర్ట్ కార్యాలయం ఆవరణలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్, యువభారత్ ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. కెప్టెన్ మనోజ్‌కుమార్ పాండే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుమార్, జోషఫ్ రాజు, రాజకుమారి, వహీదా, హరీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

బి.కొత్తకోట: ప్రైవేటు ఫైనాన్స్ పనులు చూసుకుని తిరిగి బైక్‌పై వెళుతున్న ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని తుమ్మనంగుట్ట సమీపంలోని రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం కాకిమడుగుకు చెందిన వెంకటేష్ (32), అనిమిగా నిపల్లెకు చెందిన లోకేష్ (22) మదనపల్లెలోని బాలాజీ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ బాయ్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ములకలచెరువుకు మదనపల్లె నుంచి బైక్‌పై వచ్చిన వారు పనులు చూసుకుని తిరిగి మదనపల్లెకు బయలుదేరారు. వీరు రైల్వేస్టేషన్ సమీపంలోకి వెళుతుండగా వెనుకవైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వెళుతున్న లోకేష్, వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు. ఫైనాన్స్ సంస్థ సిబ్బంది మృతులను గుర్తించారు.

ఆశా ఇంటర్వ్యూలకు 142 మంది హాజరు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఆశా కార్యకర్తల ఇంటార్వ్యూలు నిర్వహించారు. మొత్తం 69 పోస్టులకు 174 మంది దరఖాస్తు చేసుకోగా 142 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరందరికి డీఎంహెచ్ఓ సుధారాణి సమక్షంలో ఇంటార్వ్యూ చేశారు. రెండు రోజుల్లో కలెక్టర్ ఆదేశాలతో ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని ఆమె తెలిపారు. ఆశ నోడల్ అధికారి హనుమంతరావు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, అధికారులు ప్రవీణ, గిరి, రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ చేస్తున్న డీఎంహెచ్ఓ